www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 5 మే 2023
5
ఏలూరు



ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యం కొనుగోళ్లును వేగవంతం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు ఉల్లంకి నాంచారయ్య కోరారు. గురువారం ఆయన ముదినేపల్లిలో మాట్లాడుతూ మండలంలోని పలుగ్రామాల్లో నెల తరబడి రైతుల వద్ద వందలాది టన్నుల ధాన్యం నిల్వలున్నాయన్నారు. కొనుగోలుకు రైస్ మిల్లర్లు నిరాకరిస్తున్నారని, పంట చేతికి వచ్చినా రైతులకు అమ్ముకునే పరిస్థితి లేక, పంటకు చేసిన అప్పులు చెల్లించలేక సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదన్నారు. ప్రతీ గింజనూ కొంటామని మంత్రులు, ప్రజాప్రతినిధులు వేదికలపై ఉపన్యాసాలే తప్ప ఆచరణలో శూన్యమన్నారు. ప్రభుత్వం స్పందించి రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



ఏం తినాలి.. ఎలా బతకాలి

- నాచుగుంట, నందమూరుల్లో చంద్రబాబు వద్ద ఘొల్లుమన్న వరి రైతులు
- సంచులు ఇవ్వరు, లారీలు పంపరు.. ముక్కుపేరుతో కోతలంటూ ఆవేదన
- చిరిగిన సంచులు చూపిస్తూ ఇదీ మా దుస్థితి అన్న రైతులు
- తడిసిన, మొలకెత్తిన ధాన్యం చూపుతూ కన్నీరుమున్నీరు
- పిల్లలకు ఫీజులు కట్టలేని పరిస్థితి ఏర్పడిందంటూ బాధ
- చివరి రైతుకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం
- రైతులకు చంద్రబాబు భరోసా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం

'పండించిన ధాన్యం పొలాల్లోనే ఉంది. అకాల వర్షాలకు ధాన్యం తడిసి, మొలకలొచ్చాయి.. సంచులు ఇవ్వరు.. లారీలు పంపరు.. ముక్కపేరుతో కోతలు పెడుతున్నారు.. ఇలాగైతే తాము ఏం తినాలి.. ఎలా బతకాలి' అంటూ నాచుగుంట, నందమూరు గ్రామాల్లో పర్యటించిన టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఎదుట రైతులు ఘొల్లుమన్నారు. గురువారం ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నాచుగుంట, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని నందమూరు గ్రామాల్లో చంద్రబాబు పర్యటించారు. విజయవాడ నుంచి వచ్చిన చంద్రబాబుకు కలపర్రు టోల్‌గేట్ వద్ద టిడిపి శ్రేణులు పెద్దఎత్తున స్వాగతం పలికాయి. అనంతరం ఒంటిగంటకు చంద్రబాబు కాన్వాయ్ నాచుగుంట చేరుకుంది. హైవే పక్కన పుంతరోడ్డులో కల్లాల్లో ఉన్న ధాన్యపు రాశులను చంద్రబాబు చూశారు. ఆయన వాహనం దిగే సమయానికి వర్షం మొదలైంది. దీంతో కొంతసేపు వాహనంలోనే ఉండిపోయారు. వర్షానికి పుంతరోడ్డు పూర్తిగా బురదగా మారడంతో కార్లు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ట్రాక్టర్‌పై ఎక్కి కొంతదూరం చంద్రబాబు ధాన్యపు రాశులను చూశారు. తర్వాత కాలినడకన వెళ్లి కల్లాల్లో తడిసిన ధాన్యపు రాశులను, మొలకొచ్చిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి ఓదార్చారు. మహిళా రైతు జువ్వలపల్లి ప్రభావతి, రైతులు సుంకవల్లి మహదేవ, రవిశంకర్ తదితరులు మాట్లాడుతూ సంచులు ఇవ్వడం లేదని, ఇచ్చిన సంచులు సగం చిరిగిపోయి ఉంటున్నాయని, లారీలు లేక ధాన్యం వెళ్లడం లేదని, ముక్కపేరుతో మిల్లర్లు భారీగా కోతలు పెడుతున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం అమ్ముడు కాక పిల్లలకు ఫీజు కట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటి వరకూ అధికార పార్టీకి చెందిన ఎంఎల్‌ఎలుగాని, మంత్రులుగాని తమ వద్దకు రాలేదన్నారు. మీరొస్తున్నారని బుధవారం సాయంత్రం సంచులు ఇచ్చారన్నారు. 12 ఎకరాల్లో పంటను మాత్రమే కొనుగోలు చేయడంతో ఎక్కువ భూమి సాగుచేసిన రైతుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. 60 బస్తాలు పండిస్తే 53 బస్తాలు మించి కొనుగోలు చేయడం లేదన్నారు. నిన్నటి వరకూ 45 శాతంగా ఉన్న చితుకు నిబంధనను 40 శాతానికి కుదించారన్నారు. తమగోడు ఏఒక్కరూ వినిపించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చిరిగిన సంచులను చంద్రబాబుకు చూపించి తమ పరిస్థితి ఈవిధంగా ఉందన్నారు.

మద్దతు ధరకు తడిసి, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేయాలి : చంద్రబాబు

ప్రభుత్వ అసమర్థత కారణంగా వరి రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తే రైతులకు ఇన్ని కష్టాలు ఉండేవి కావన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన తీరు చూస్తే సిగ్గేస్తుందన్నారు. వర్షాల గురించి వాతావరణ శాఖ ముందుగానే చెబుతుంటే, వ్యవసాయశాఖ పంట, నూర్పిళ్ల గురించి వివరిస్తుందని ఇవన్నీ బేరీజు వేసుకుని ముందుకు సాగితే ఈ పరిస్థితి వచ్చేదికాదన్నారు. రైతులకు న్యాయం చేయండి.. లేకపోతే రాజీనామాలు చేయండంటూ సవాల్ విసిరారు. సంచులు ఇవ్వరు, లారీలు పంపించరు, డబ్బులు ఇవ్వకపోతే రైతుల పరిస్థితి ఏమిటన్నారు. కరోనాలో అన్నీ మూతపడినా రైతులు పొలాల్లో దిగి పండించడం కారణంగానే ఆహార కొరత రాలేదన్నారు.



మహిళా రైతు ప్రభావతికి రూ.2.30 లక్షలు సాయం

పిల్లలకు ఫీజు కట్టలేని పరిస్థితిలో ఉన్నానని చెప్పిన మహిళా రైతు ప్రభావతినిఫీజు ఎంతో అడిగి రూ.2.30 లక్షలు నగదు చంద్రబాబు అప్పటికప్పుడు అందజేశారు. దీనిపై ప్రభావతి మాట్లాడుతూ తాను ఇప్పటి వరకూ ఇన్నాళ్లూ వైసిపికి ఓట్లేసాననీ, ఇక నుండి టిడిపి కోసం పని చేస్తానని అన్నారు. పార్టీలో చేర్చుకునేందుకు సాయం చేయలేదని, కష్టాల్లో ఉన్నారని రైతుకు సాయం చేశానని చంద్రబాబు చెప్పారు. తాను వస్తున్నానని అప్పటికప్పుడు లారీలు, సంచులు ఇస్తున్న అధికారులు ముందుగా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రతి రైతుకు బస్తాకు రూ.1530 ఇచ్చేలా టిడిపి పోరాడుతుందన్నారు. చివరి రైతుకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదన్నారు. అవసరమైతే మళ్లీ వస్తా.. తాడేపేడో తేల్చుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గన్ని వీరాంజనేయులు, తోట సీతారామలక్ష్మి, ఎంఎల్‌సి నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, టిడిపి నేతలు పాల్గొన్నారు.



యాత్రను ప్రారంభిస్తున్న ఎ.రవి

'ఉపాధి' నిర్వీర్యానికి బిజెపి కుట్ర

- వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన చట్ట పరిరక్షణ యాత్ర
- ప్రారంభించిన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో భారీగా ఈ చట్టానికి నిధుల్లో కోత విధించిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్ట పరిరక్షణకు వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన యాత్రను ఎ.రవి గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వ్యకాస జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ ఉపాధి హామీ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ యాత్ర సాగుతుందన్నారు. మండలంలోని ఎ.పోలవరం, తాడువాయి, మంగిశెట్టిగూడెం, వేగవరం, చక్రదేవరపల్లి, గురవాయిగూడెం గ్రామాల్లో తొలిరోజు యాత్ర సాగిందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజావ్యతిరేక విధానాలతో దేశప్రజలపై పెనుభారాలు మోపుతుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే వ్యవసాయ కార్మికులు పోరాడి సాధించుకున్న ఉపాధి చట్టం నిర్వీర్యానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించిందని అసహనం వ్యక్తంచేశారు. ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫొటో సిస్టంను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పద్ధతిలో పేస్లిప్, సమ్మర్ అలవెన్స్, సైట్ సూపర్‌వైజర్లకు పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశం కోసం ధర్మం కోసం అంటూ ప్రజల సంపదను బడాపెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అమ్ముతూ భావితరాల భవిష్యత్‌ను కాలరాస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపికి దేశం పట్ల, ప్రజలపట్ల చిత్తశుద్ధి ఉంటే నిరంతరం పెరుగుతున్న నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని, ఇంటిపన్ను చెత్త సేకరణ పన్ను రద్దు చేయాలని కోరారు. 200 రోజులు ఉపాధి పనులు చూపి, రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈనెల పదో తేదీన జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద చేపడుతున్న ధర్నాలో ఉపాధి కార్మికులు పెద్దఎత్తున పాల్గొని తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అందుగుల ప్రభాకర్‌రావు, తామ ముత్యాలమ్మ, వై.సీత, బి.రాంబాబు, పి.దుర్గారావు, పి.సూర్యారావు, ఎస్‌కె.సుభాషిణి, వి.గోపి, సత్తిబాబు, బొబ్బిలి గంగరాజు పాల్గొన్నారు.



విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలను పరిశీలిస్తున్న నివాస్

ప్రజలకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనరు జె.నివాస్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనరు జె.నివాస్ అన్నారు. గురువారం స్థానిక శనివారపుపేటలోని వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో కలిసి నివాస్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ క్లినిక్‌కు వచ్చే రోగులకు ఇబ్బందికరమైన పరిస్థితులుంటే ఇ-టెలీ కన్సల్టేన్సీ ద్వారా స్పెషలిస్టు డాక్టర్లతో ఏలూరు లేదా విజయవాడ వారితో మాట్లాడే విధానాన్ని కమిషనర్ పరిశీలించారు. కొత్తగా విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు కొన్ని రికార్డులు ఇచ్చామని, వీటిని ఎప్పటికప్పుడు అన్ని వివరాలతో నమోదు చేయాలని, వివరాలు స్పష్టంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఈ రికార్డుల్లో డ్రగ్స్ పేషెంట్స్ వివరాలు, రోగులకు ఏ మందులిచ్చారు? అనేది ఈ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఇప్పటి వరకూ ఈ క్లీనిక్‌లో ఎన్ని డయాబెటీస్ పరీక్షలు చేశారని వివరాలు అడిగితెలుసుకున్నారు. క్లీనిక్‌లో ఉన్న వైద్యపరికరాల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కమిషనరు ఆశా వర్కర్లు, వాలంటీర్లతో మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం గురించి విలేజ్ హెల్త్ క్లీనిక్‌లో జరుగుతున్న వైద్య సేవల గురించి రోగులకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతీమండలానికి రెండు పిహెచ్‌సిలు, ఇద్దరు డాక్టర్లు, ఒక 104 వాహనంతో అనుసంధానం చేసి ప్రతీరోజు వారికి కేటాయించిన గ్రామాల్లోని పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రోగులకు ఉచిత వైద్య సేవలందించాలని తెలిపారు.

గ్రామాల్లో నెలకు కనీసం రెండుసార్లు వైద్యులు సందర్శించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందజేస్తారని చెప్పారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, కమిషనరు నివాస్‌కు విలేజ్ క్లీనిక్‌లో ఏర్పాటు చేసిన సదుపాయాలను వివరించారు. అనంతరం చాటపర్రులోని పిహెచ్‌సిని కమిషనరు కలెక్టర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి. ఆశ, ఏలూరు మున్సిపల్ కమిషనరు ఎస్.వెంకటకృష్ణ, నోడల్ ఆఫీసరు ఎఫ్‌పిసి డాక్టర్ జోషిరాయ్, హెచ్‌డబ్ల్యుసి నోడల్ ఆఫీసర్ డాక్టర్ పూర్ణచంద్రరావు, డిపిఎంఒ డాక్టర్ జ్యోతి, డిఐఒ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ ఆనంద్, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా చెరువు పూడ్చివేత పనులు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు నగరపాలక సంస్థలో విలీనమైన శనివారపుపేటప్రాంతంలోని సీతాగార్డెన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న ఏనుగులదిబ్బ చెరువును హడావుడిగా పూడ్చేస్తున్నారు. చెరువులు పూడ్చకూడదని సుప్రీంకోర్టు ఆదేశాలున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు బేఖాతారు చేయడం లేదు. ఇటీవల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద భూగర్భ డ్రెయినేజీ పనులను నగరపాలక సంస్థ అధికారులు ప్రారంభించారు. అదే అదునుగా చూసుకుని డ్రెయినేజీ తవ్వుతున్న మట్టిని ఏనుగుల చెరువులోకి తరలించి హడావుడిగా చదును చేసేస్తున్నారు. గతంలో పంచాయతీపరిధిలో ఉండగా ఇదే విధంగా చెరువును పూడ్చి ఆక్రమించేందుకు నేతలు ప్రయత్నించారు. అప్పుడు జిల్లా అధికారుల జోక్యంతో చెరువు పూడ్చివేత నిలిచింది. ప్రస్తుతం మళ్లీ యథేచ్ఛగా చెరువు పూడ్చివేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని చెరువు పూడికను నిలుపుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పూడ్చివేస్తున్న చెరువు



ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు

జెండా స్థూపం ధ్వంసంపై

కొనసాగిన కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో తొలగించిన మేడే జెండా స్తూపాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని మున్సిపల్ కార్మికులు చేపట్టిన ఆందోళన రెండోరోజు గురువారమూ కొనసాగింది. సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన ఆందోళనకు పసల సూర్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సుభాషిణి, ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు జెవి.రమణరాజు మాట్లాడారు. మేడే సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసిన మున్సిపల్ కార్మికుల జెండాను తొలగించిన కమిషనర్ బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. జెండా స్తూపాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికులు ఆందోళన చేస్తే సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్న మున్సిపల్ కమిషనర్ తీరుపై కార్మికులు, కార్మిక నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్మిక జెండాలను అవమానిస్తున్న కమిషనర్ క్షమాపణ చెప్పే వరకు ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విగ్నేష్, నాగరాజు, బాలరాజు, నాగేశ్వరరావు, వేల్పుల రాజు, వెంకటేష్, లక్ష్మణ్, తులసి, మంగా, సత్యవతి గొయ్యమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


మృతిచెందిన కృపాకుమారి

అనారోగ్యంతో బాధపడుతున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు పరిస్థితి విషమించి గురువారం మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయురాలు పాలకూటి కృపాకుమారి(55) షుగర్ వ్యాధితో బాధపడుతోంది. వ్యాధి తీవ్రమవడంతో బంధువులు వైద్యం నిమిత్తం బుధవారం స్థానిక నిర్మల ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం ఏలూరుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రయివేటు అంబులెన్స్‌లో ఏలూరు తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలో ఆమె మృతి చెందారు.

బంధువుల ఆగ్రహం

షుగర్ వ్యాధితో ఆసుపత్రిలో చేరితే ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తడంపై మృతురాలి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మల ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఉపాధ్యాయురాలు మృతి చెందారని వారు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి వద్ద మృతదేహంతో ఆందోళన చేపట్టారు. బంధువులు ఆగ్రహంతో ఆసుపత్రిలోని సామగ్రిని ధ్వంసం చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఏడాదిగా పోరాడుతున్నా గోడు పట్టదా

దోసపాడు దళితుల పట్ల నిర్లక్ష్యం తగదు - చెరువుల వద్ద పేదల ఆందోళన

ప్రజాశక్తి - దెందులూరు రూరల్

దోసపాడు పేదలకు చెందిన అసైన్డ్, సీలింగ్, గయాళ భూములు తక్షణం అప్పగించాలని, ఏడాదికాలంగా పోరాడుతున్నప్పటికీ కనీసం పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్రపోతుందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.ఆనందరావు విమర్శించారు. పేదలు, దళితులు చెరువుల్లోకి వెళ్తుండగా పోలీసు బలగాలతో బుధవారం దోసపాడులో అడ్డుకున్నారు. దీంతో దళితులు దోసపాడు సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. అనంతరం చెరువు వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదల భూములను బడాభూస్వాములకు అప్పనంగా కట్టబెడుతున్నారని మండిపడ్డారు. దళితుల అభ్యున్నతికి పాటుపడతామని చెబుతూనే దళితుల భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని విమర్శించారు. భూస్వాములపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. 25 ఏళ్ల నుండి పేదల భూములను ఆక్రమించుకుని అనుభవిస్తున్నవారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు రికార్డులను తారుమారు చేస్తూ పేదల భూములను వారికి దక్కకుండా చేస్తున్నారని విమర్శించారు. భూముల్లోకి వెళ్లకుండా తహశీల్దార్, ఎస్ఐ, పోలీసు బలగాలతో పేదలను అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. భూముల వివరాలు చెప్పి ఈ భూముల దళితులవేనని ప్రకటించినా వాటిని భూస్వాముల నుండి స్వాధీనం చేసుకోకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. భూస్వాముల ఇచ్చే లంచాలు మింగి పేదలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. మండల రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడుతుంటే జిల్లా అధికారులు మొద్దునిద్రపోతున్నారని విమర్శించారు. రెవెన్యూ అధికారులపై, పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దోసపాడు, పోతునూరు, కొవ్వలి, దెందులూరు తదితర గ్రామాల్లో వందల ఎకరాల పేదల భూములు అన్యాకాంతమయ్యాయని మండిపడ్డారు. ఈ భూములు భూస్వాముల చేతుల్లో ఉండటానికి రెవెన్యూ శాఖ అధికారులే కారణమన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారుల కనుసన్నల్లో భూస్వాములు దర్జాగా భూములను అనుభవిస్తున్నారని మండిపడ్డారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఒ కలగజేసుకుని పేదలకు చెందిన భూములను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ పోరాట నాయకులు ఆనందరావు, జూన్ రాజ్, నాగేంద్ర, వినోద్, మణి, లక్ష్మి, బేబీ, లలిత, గంగాధర్ నాయకత్వం వహించారు.


చెరువుల వద్ద ధర్నా చేస్తున్న దళితులు

మేడే స్థూపం ధ్వంసం అనాగరిక చర్య

- తిరిగి నిర్మించాలి
- అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మేడే సందర్భంగా మున్సిపల్ కార్మికులు తమ కష్టార్జితంతో ఏలూరు పంపుల చెరువు రోడ్డులోని వెహికల్ షెడ్‌వద్ద, గోడ పక్కన నిర్మించుకున్న జెండా స్తూపాన్ని మున్సిపల్ అధికారులు అన్యాయంగా కూల్చడాన్ని అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం పంపులు చెరువు వెహికల్ షెడ్ వద్ద జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. ఐఎఫ్‌టియు అనుబంధ ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ డ్రైవర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు యు.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్, జనసేన నాయకులు శ్రావణ్ కుమార్, తెలుగుదేశం మాజీ కార్పొరేటర్ వీరంకి త్రినాథ్, ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాథరావు, నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబా, ఎంఆర్‌పిఎస్ నాయకులు కందుల రమేష్, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు లింగమల్లు శ్రీనివాసరావు, సిపిఐ ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కె.నాని, ఎఐటియుసి నాయకులు పుప్పాల కన్నబాబు ప్రసంగించారు. టిఎన్‌టియుసి అధ్యక్షులు కోలపల్లి ఉమాశంకర్ మద్దతు తెలియజేశారు. కార్మికుల స్థూపాన్ని కూల్చడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. స్థానిక కార్పొరేటర్ వత్తాసుతో మున్సిపల్ యంత్రాంగం ఈ విధమైన అనాగరిక చర్యకు పాల్పడటాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఏలూరులో ఇంతవరకూ లేని దుష్టసాంప్రదాయాన్ని నెలకొల్పారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్తూపాలను, జండా దిమ్మలను కూల్చడం హేయమైన చర్యగా వారు అభివర్ణించారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం తప్పు తెలుసుకుని, స్తూపనిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఈనెల ఐదో తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ కమిషనర్‌కు, మేయర్‌కు, ఎంఎల్‌ఎకు వినతిపత్రాల సమర్పించాలని తీర్మానించారు. అప్పటికీ వారు చర్యలు తీసుకోకపోతే భవిష్యత్‌లో ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు శేఖర్, కార్యదర్శి రాజేష్, ఐఎఫ్‌టియు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, నగర నాయకులు, డి.వీరినాయుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నేత



మాట్లాడుతున్న టిఎన్.స్నేహన్

రక్తహీన రహిత జిల్లా కోసం కృషి


ప్రజాశక్తి - టి.నరసాపురం

రక్త హీన రహిత జిల్లా కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని సచివాలయ శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ టిఎన్.స్నేహన్ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశం మండల వైద్యాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్నేహన్ మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలికలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ పి ప్రసాదరావు, హెచ్ఎస్ రవి, పిహెచ్ ఎన్ లలిత కుమారి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో జోరుగా జూదం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో జూదం, పేకాట, కోడిపందేలు జోరుగా నిర్వహిస్తున్నారు. మండలంలోని సింగరాయపాలెం, కాకరవాడ, గురజ, పెనుమల్లి, పెదపాలపర్రు, కోడూరు, పేరూరు, దేవరం, చేవూరు, గొల్లగూడెం పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ జూదాల్లో ముదినేపల్లి, గుడ్లవల్లేరు, పెడన మండలాల నుంచి జూదరులు పాల్గొంటున్నట్లు సమాచారం. చిరురుకోట, తామరకొల్లు పెదకామనపూడి, చినకామనపూడి, అన్నవరం, ముదినేపల్లి వైవాక పలు గ్రామాల్లోని చెరువుగట్లపై జూదాలు, కోడిపందేలు, పేకాట జోరుగా జరుగుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. పోలీసులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులు కూడా లేకపోవడంతో జూదాలకు తెరలేపారు. దీంతో దాదాపు మండల వ్యాప్తంగా జూదాలు, పేకాట, కోడిపందేలు నిర్వహణ జరుగుతోంది. వ్యసానపరులు జూదాల్లో పాల్గొంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు జూదం ,పేకాట, కోడిపందేలు నిరోధించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటకృష్ణ

సచివాలయాల్లో కమిషనర్ తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటకృష్ణ వన్‌టౌన్ పరిధిలో వెంకన్న చెరువు సమీపంలో ఉన్న 50, 51 సచివాలయాలను గురువారం తనిఖీ చేశారు. సచివాలయాల్లో రికార్డులు అటెండన్స్, స్పందన, డైలీ డైరీ, ఇన్వెంటరీ మీటింగ్, విసిటర్స్, క్లాప్ యూసర్ ఛార్జెస్, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది పని తీరును పరిశీలించి, వారి సమస్యలపై తగు ఆదేశాలు ఇచ్చారు.

'మాదిగల రాజ్యాధికారంతోనే అభివృద్ధి'

ప్రజాశక్తి - చింతలపూడి

మాదిగల రాజ్యాధికారంతోనే అభివృద్ధి సాధ్యమని మాదిగ మహిళ జాతీయ నాయకురాలు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల సమన్వయకర్త చవటపల్లి విజయ మాదిగ అన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో గ్రామ కమిటీల ఎంపిక సమావేశం చింతలపూడి నియోజకవర్గ ఎంఎస్‌పి కన్వీనర్ కొలికిపాము హైమావతి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ మాదిగ మాట్లాడుతూ మన ఓటు మనకే అనే నినాదంతో మంద కృష్ణ మాదిగ మహాజన సోషలిస్ట్ పార్టీ ఏర్పాటు చేశారని, ఆ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి చింతలపూడి మండల కన్వీనర్ పొలిమేర నాగమణి, టి.నరసాపురం ఎంఎస్‌పి కన్వీనర్ కొమ్ముకూరి సుగుణ మాదిగ పాల్గొన్నారు.


స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభిస్తున్న మెహర్‌రాజ్

వేసవి క్రీడా శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు 2023-24లో భాగంగా స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద ఉన్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్విమ్మింగ్ పూల్‌లో గురువారం స్విమ్మింగ్ విభాగాన్ని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిఇఒ ఎమ్‌డి హెచ్ మెహర్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణ శిబిరంలో సుమారు 50 మంది పాల్గొంటున్నారని, మే నెలాఖరు వరకూ ఈ శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. స్విమ్మింగ్‌పై ఆసక్తి ఉన్నవారు. ఈ శిక్షణను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్విమ్మింగ్ కోచ్ బి.గణేష్, స్విమ్మింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని చీమలవారిగూడెంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చీమలవారిగూడేనికి చెందిన వివాహిత కృష్ణవేణి కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై గురువారం పొగాకు పంటలో వాడే పిలక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు ఆమెను హుటాహుటిన జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

చినవెంకన్న ఆలయ కొండపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. కొండపైన సెంట్రల్ పార్కింగ్ వద్ద సుమారు 45 సంవత్సరాల వయస్సు కలిగిన పురుషుడి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. నెల రోజులుగా ఆలయ పరిసరాల్లో సంచరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుని ఆచూకీ కావాల్సిన వారు 9440796653 నెంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

దళితవాడలో డ్రెయినేజీ వ్యవస్థ లేక అవస్థలు

ముందుకు పారని మురుగు నీరు
రోగాలబారిన ప్రజలు


రోడ్డుపై మురుగునీరు

ప్రజాశక్తి - చాట్రాయి

మండల కేంద్రమైన చాట్రాయిలోని దళితవాడలో డ్రెయినేజీ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మురికి నీరంతా సిమెంట్ రోడ్డు పైకి వచ్చి నిలవడంతో ప్రజలు నడించేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పక్కన ఉన్న మంచినీటి బోరులోకి మురుగునీరు చేరి తాగునీరు కలుషితమవుతోంది. దీంతో తాము అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే ప్రదేశంలో అంగన్‌వాడీ కేంద్రం ఉంది. దీంతో అంగన్‌వాడీకి వెళ్లే పిల్లలు మురుగునీరు నిల్వ ఉన్న గుంతల్లో పడతారేమోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేందుకు భయపడుతున్నారు.



సిమెంట్ రోడ్డుకు అడ్డంగా వేసిన మొద్దు


మురుగునీరు తమ ఇంటి ముందు నుంచి వెళ్లకుండా స్థానికులు సిమెంట్ రోడ్డుపై అడ్డుకట్టలు వేశారు. దీంతో కొందరు స్థానికులు సిమెంట్ రోడ్డుపై నడవకుండా పెద్ద పెద్ద మొద్దులను గురువారం రోడ్డుకు అడ్డుపెట్టారు. మురుగునీరు పోయేందుకు అడ్డుకట్టలు తొలగిస్తేనే రోడ్డుపై వేసిన మొద్దులను తీసివేస్తామన్నారు. దీంతో స్థానికుల మధ్య చిన్నపాటి వివాదం చోటు చేసుకుంది. ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారడంలేదని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

ఎంపిపిల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సత్యనారాయణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

రాష్ట్ర ఎంపిపిల సంఘం కార్యవర్గసభ్యుడిగా ముదినేపల్లి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ ఎంపికయ్యారు. సంఘం కార్యవర్గ ఎన్నికలు ఏలూరులో బుధవారం జరిగాయి. సంఘంలో క్రియాశీలక పాత్ర పోషించి ఎంపిపిల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు గురువారం ముదినేపల్లిలో రామిశెట్టి సత్యనారాయణకు శాలువ కప్పి, పూలమాలలు వేసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైసిపి మండల అధ్యక్షులు ఎం.ఏసుబాబు, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, కోఆప్షన్ సభ్యులు షేక్ అల్లాభక్షు నిమ్మగడ్డ భిక్షాలు, బేతపూడి వెంకటరమణ, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు శీలం రామకృష్ణ, వైసిపి మండలస్థాయి నేతలు బి.శేషుబాబు, పేరే రామకృష్ణ, పృధ్వి, సాయి, సతీష్, కిషోర్, రాజేష్, కుమార్, కె.విష్ణువర్ధన్, బేతు రాజా హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.


సత్యనారాయణను అభినందిస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్


వెంకటరెడ్డిని అభినందిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటరెడ్డికి సన్మానం

పోలవరం : ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డిని ఎంఎల్ఎ తెల్లం బాలరాజు గూటాల గ్రామంలోని ఆయన నివాసం వద్ద గురువారం సత్కరించారు. పూలమాలలు వేసి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సుంకర వెంకటరెడ్డి మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఎంఎల్ఎ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సింగరాజు, ఎంపిటిసి సభ్యులు డి.హరిరామకృష్ణ, వైసిపి నాయకులు కోటం బాబురావు, సిఐ కె.విజయబాబు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - చింతలపూడి

వేసవికాలంలో దాహార్తికోసం చలివేంద్రాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని ఎంఎల్ఎ ఎలిజా అన్నారు. పట్టణంలో చింతలపూడి సొసైటీ వారు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలీప్, సొసైటీ ఛైర్మన్ ఆత్కూరి సుబ్బారావు, సిటీ మెడికల్ దుర్గారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


ప్రజాశక్తి - చింతలపూడి

తడిసిన మొక్కజొన్నను, ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. మండలంలోని రేచర్ల గ్రామంలో తడిసిన మొక్కజొన్న పంటను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే అమ్మిన రైతులకు ఎకరానికి రూ.పదివేలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా పరదాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో ఎపి రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.కాలేశా, దంతా కృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సిపిఐ మండల కమిటీ సభ్యులు ఎస్‌కె.జాని, రైతు సంఘం నాయకులు తాడిగడప మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ఇంధన పొదుపునకు కృషి అవసరం

ప్రజాశక్తి - మండవల్లి


పరిమితిగా లభ్యమయ్యే ఇంధనాన్ని దుర్వినియోగం కాకుండా పొదుపు చేసే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. ఇంధన సంరక్షణ క్షమత పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గేయిల్ ఇండియా లిమిటెడ్ గుడివాడ వారి ఆధ్వర్యంలో వాహనదారులకు గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంధనాన్ని మితిమీరి వాడడం ప్రమాదకరమన్నారు. వాహనదారులు ప్రయాణించే క్రమంలో సొంత వాహనాలను వాడడం ద్వారా ఇంధనం వృధా అవుతుందని గమనించి ప్రజా వాహనాలను వినియోగించుకోవాలన్నారు. వాహనాల టైర్లలో గాలి లేకపోయినా ఇంజన్ సరిగా లేకపోయినా ఇంధనం వాడకం పెరుగుతుందని, వాహనాలను ఎప్పటికప్పుడు పరీక్షించుకుని ఇంధనం అధిక వాడకానికి అడ్డుకట్ట వేయాలని చెప్పారు. రైల్వే గేట్ల వద్ద ఆగినప్పుడు ఇంజన్ ఆఫ్ చేయకపోవడం వల్ల ఇంధన వాడకం పెరుగుతుందన్నారు. పరిమితికి లోబడి వినియోగిస్తూ ఇంధనం భవిష్యత్ తరాల అవసరాలు తీర్చే విధంగా ఇంధనాన్ని వినియోగించాలని ఆయన తెలిపారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి సుమారు 250 వాహనాలకు కాలుష్య తనిఖీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గెయిల్ అధికారులు బాలకృష్ణయ్య, కృష్ణమాచార్యులు, శివప్రసాద్, కుమారస్వామి పాల్గొన్నారు.


పొల్యూషన్ సర్టిఫికెట్లు అందిస్తున్న ఎస్ఐ

బంగారంపై తక్కువ వడ్డీకి రుణాలు

ప్రజాశక్తి - మండవల్లి

బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీకి రుణాలందిస్తున్నామని ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్ బొంతు దుర్గారావు స్పష్టం చేశారు.స్థానిక ఇండియన్ బ్యాంకులో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ ఆధ్వర్యంలో బంగారు ఆభరణాలపై వ్యవసాయ రుణాల పండుగను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పండుగను జూన్ 30 వరకూ కొనసాగిస్తామని, రుణాలు పొందాల్సిన వారు ఇండియన్ బ్యాంకును సంప్రదించాలన్నారు. బంగారు ఆభరణాలపై కేవలం 71 పైసల వడ్డీతో, రూ.మూడు లక్షల రూపాయల వరకూ ఎలాటి ప్రాసెసింగ్ ఫీజు లేకుండా రుణాలను అందిస్తున్నామన్నారు. అంతేకాకుండా నాలుగు లక్షల వరకూ భూమి రికార్డులు కూడా అవసరం లేకుండానే సులభంగా రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఆన్‌లైన్ విధానంలోనూ అతి తక్కువ సమయంలో బంగారంపై రుణాలు పొందే అవకాశం అవకాశం ఉందని తెలియజేశారు. ఇప్పటివరకూ అందించిన రుణాలు ఏ ఇతర రుణాలతో పోల్చి చూసుకున్న బంగారు ఆభరణాలపై వడ్డీ తక్కువేనన్నారు. బంగారు ఆభరణాలపై వ్యవసాయ రుణాల పండుగ సందర్భంగా అతి తక్కువ వడ్డీకే అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎబిఎన్.పద్మకుమారి, ఫీల్డ్ ఆఫీసర్ రాజేష్, కె.అమర్నాథ్ పాల్గొన్నారు.



గోల్డ్ లోన్ అందిస్తున్న మేనేజర్


విజయవంతంగా చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - ఉంగుటూరు

టిడిపి అధినేత చంద్రబాబు మండలంలో గురువారం చేపట్టిన పర్యటన విజయవంతమైందని టిడిపి నేత, మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు అన్నారు. జాతీయ రహదారి వెంబడి ఏలూరు కాలువ ఆయకట్టు పొలాల్లో ధాన్యం రైతుల సమస్యలు, కష్టనష్టాలను తెలుసుకునేందుకు చేపట్టిన పర్యటనలో నియోజకవర్గంలో కార్యకర్తలు, స్థానిక రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు రావాల్సి ఆయన 12.55 గంటలకు ఉంగుటూరు టోల్‌గేట్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి నాచుగుంటలో ధాన్యం రాశులు ఆరబెట్టిన ప్రాంతానికి చేరుకుని మధ్యాహ్నం 3.05 గంటల వరకూ రైతులతో మాట్లాడారు. మొలకలు వచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. చిరిగిన గోనె సంచులను చూస్తూ రైతులను ఓదారుస్తూ ఆద్యాంతం ఉల్లాసంగా పర్యటించారు. పార్టీ మండల అధ్యక్షులు పాతూరి విజయకుమార్, నాయకులు కడియాల రవిశంకర్, ఇమ్మణి గంగాధర్‌రావు, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు రెడ్డి సూర్యచంద్రరావు, మాజీ జెడ్‌పిటిసి చింతల వాసు, నారాయణపురం, ఉంగుటూరు సర్పంచులు బండారు సింధు, దిడ్ల అలకనంద, మండల కార్యదర్శి నల్లా ఆనంద్ పాల్గొన్నారు.

వర్షం సైతం లెక్క చేయకుండా

చంద్రబాబు సభాస్థలికి చేరుకున్న కొద్దిసేపటికే వర్షం కురిసింది. దీంతో అరగంటపాటు బాబు వ్యాన్‌లోనే ఉండిపోయారు.


తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న చంద్రబాబు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - మండవల్లి

లబ్ధిదారులంతా త్వరితగతిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.మల్లేశ్వరి సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణ ఇంజినీరింగ్ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బేస్‌మెంట్ పూర్తయిన వారు గుమ్మాలు, గోడ, అనంతరం శ్లాబ్ నిర్మించుకునేలా వారిని చైతన్యపరచాలన్నారు. ఇప్పటివరకూ ఇళ్ల నిర్మాణం చేపట్టని లబ్ధిదారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించి ఇల్లు నిర్మించుకునేలా కృషి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన చోట విద్యుత్, కుళాయిల సౌకర్యం కల్పించాలని సూచించారు. గృహనిర్మాణ లబ్ధిదారులతో తప్పనిసరిగా ఇకెవైసి చేయించాలన్నారు. గృహాలు నిర్మించుకునే క్రమంలో తలెత్తున సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం సహించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మల్లేశ్వరి

సచివాలయ, వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని పిఒపి ఆనంద్ బాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ వైద్య సిబ్బందితో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విధులకు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలని సూచించారు. వైద్య సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వ్యాధుల బారిన పడకుండా చూడాలన్నారు. చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆధార్ లేని చిన్నారులను గుర్తించి ఆధార్ వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఒ శ్రీనివాసరావు, ముదినేపల్లి జూనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

KANAKADURGA
FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : ఏలూరురోడ్డు, లక్ష్మిథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25.05.2023 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1172.84 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఎంపిడిఒ రాంబాబు అన్నారు. మండల కార్యాలయంలో అభివృద్ధిపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలో జగనన్న కాలనీ ఇళ్లపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాంబాబు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. సిఎం జగన్ ఆశయం ప్రకారం ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్నారు. ఆయన ఆశయ సాధన కోసం అందరం కలిసి పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపిడిఒ మణికుమరి, హౌసింగ్ ఎఇ పాల్గొన్నారు.

లోపూడిలో ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ముసునూరు : మండలంలోని లోపూడి గ్రామంలో జగనన్న ఇళ్ల నిర్మాణ పనులకు ముసునూరు జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, గ్రామ సర్పంచి పేరం కృష్ణలో ఆధ్వర్యంలో గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కోటగిరి రాజానాయనా మాట్లాడుతూ ప్రతి పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇచ్చి, ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకోవడానికి ఉచితంగా సామగ్రి అందిస్తున్నారు. తాగునీరు, వీధిలైట్లు, గ్రామపంచాయతీ నుంచి అందించే పలు సదుపాయాలు కల్పిస్తున్నారని చెప్పారు.

సీజ్డ్ వాహనాలకు వేలం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన 18 వాహనాకు 15 ద్విచక్ర వాహనాలను రూ.2.78 లక్షలకు వేలం నిర్వహించినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్టేషన్ వద్ద గురువారం ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జీలుగుమిల్లి సిఐ జి.వెంకటేశ్వరావు అధ్యక్షతన 18 వాహనాలకు వేలంపాట నిర్వహించగా 15 ద్విచక్ర వాహనాలు రూ.2.78 లక్షలకు వేలం జరిగిందని, మూడు వాహనాలకు వేలంపాట కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదని చెప్పారు. మిగిలిన వాహనాలకు మళ్లీ వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ వై.దుర్గారావు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా పేరుపాలెం బీచ్ అభివృద్ధి

ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాద్‌రాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

పేరుపాలెం బీచ్‌ను పర్యాటక కేంద్రంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు అన్నారు. గురువారం మండలంలోని పేరుపాలెం బీచ్‌లో వైఎస్ఆర్ స్మృతివనం, విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడారు. బీచ్ అభివృద్ధికి ప్రభుత్వం నుండి రూ.కోటి నిధులు మంజూరయ్యాయని, ఆ నిధులతో 60 రోజుల్లోనే వైఎస్ఆర్ స్మృతివనం నిర్మాణం, విగ్రహం ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, సర్పంచి అందే వెంకటలక్ష్మి దొరబాబు, నాయకులు మోటుపల్లి రామభాస్కరరావు, పోతుల రమేష్, కొల్లాబత్తుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, BODA S N V SANTOSHI SUBBALAKSHMI DURGA MOUNIKA (Old Name) W/O NAGA VENKATA ADITYA KUMAR VURUM, resident of : 2-5, near Galigopuram, Sanivarapupeta, Eluru, ELURU District - 534003, Change my name from BODA S N V SANTOSHI SUBBALAKSHMI DURGA MOUNIKA (Old Name) to VURUM S N V SANTOSHI SUBBALAKSHMI DURGA MOUNIKA (New Name). Hence forth, I am being Called as VURUM S N V SANTOSHI SUBBALAKSHMI DURGA MOUNIKA (New Name) W/O NAGA VENKATA ADITYA KUMAR VURUM for all purposes.

పాస్‌పోర్టు పోయినది
CHUTTUGULLA LAKSHMI, భర్త: ఏడుకొండలు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పెనుగొండ, చిన్నవారిపాలెం నుండి పెనుగొండ జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా పడిపోయినది. నాయొక్క పాస్‌పోర్టు నంబర్: S1604009 గల పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.
అడ్రస్:
CHUTTUGULLA LAKSHMI
భర్త: ఏడుకొండలు, చిన్నవారిపాలెం
పెనుగొండ మండలం, ప॥గో॥జిల్లా
పిన్: 534320, సెల్: 63039 19270

దస్తావేజు పోయినది
ప॥గో॥జిల్లా, భీమవరం మండలం, కొవ్వాడ పుంత రోడ్, డో.నెం. 7-180, బైపాస్ రోడ్ గ్రామ కాపురస్తులు లేటు మహ్మద్ సుల్తాన్ షరీఫ్ గారి కుమారుడు మహ్మద్ ఆసిఫ్ పాషా అను నాకు చెందిన ది.06-04-2006 సం॥రం తేదీన భీమవరం సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో రిజిష్టర్ కాబడిన దస్తావేజు నెం. 2172/2006 గా రిజిష్టరు కాబడినది. ఈ ఒరిజినల్ దస్తావేజు సంచిలో పెట్టుకొని ది.02-05-2023వ తేదీన మా ఇంటి నుండి భీమవరం 1వ పట్టణంలో గల జిరాక్సు సెంటర్ నందు జిరాక్సు తీయించుకొనుటకు మోటార్ సైకిల్‌పై వెళ్ళుచుండగా మార్గ మధ్యలో అనగా భీమవరం 1వ పట్టణం పరిధిలో ఓల్డ్ వెంకట్రామా థియేటర్ సమీపంలో సంచి జారి పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది వారికి అందజేయవలసినదిగా కోరుచున్నాను.
మహ్మద్ ఆసిఫ్ పాషా
తండ్రి: సుల్తాన్ షరీఫ్, కొవ్వాడ పుంత,
సెల్: 98497 33477